క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. అయిజ మండలం పర్దిపురానికి చెందిన దేవికి రూ.21 వేల చెక్కు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వావిలాల రంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామంలో బాలయోగి శివనారాయణస్వామి ఆలయ నిర్మాణానికి ఇటిక్యాల మండలం వల్లూరు గ్రామానికి చెందిన పెద్దక్కగారి గోపాల్‌రెడ్డి సరస్వతమ్మలు రూ.1,21,000 విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడు సహాయ,సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలి



గట్టు: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాజ్‌కుమార్ ఫౌండేషన్ నిర్వాహకురాలు రత్నకుమారి అన్నారు. శుక్రవారం బోయలగూడెం గ్రామంలో రాజ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రత్నకుమారి మాట్లాడారు. 45 రోజుల పాటు 30 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సుల గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె హక్కును నిషేధిస్తారు



ధరూరు: కేంద్రంలో ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే కార్మికుల ప్రధాన అస్త్రమైన సమ్మె హక్కును కూడా నిషేధిస్తారని సీఐటీయూ జిల్లా నాయకుడు వీవీ నర్సింహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, దీని ద్వారా కార్మికులు సమ్మె చేసే హక్కు కోల్పోతారన్నారు. కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మేకల నర్సింహులు, దేవదాసు, రాము, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల ప్రారంభోత్సవం



గట్టు: మండల పరిధిలోని ముచ్చోనిపల్లె గ్రామంలో నిర్మించిన సవారమ్మ, మారెమ్మవ్వ ఆలయాల ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకురాలు బాసు శ్యామల ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాజప్పగౌడు, నర్సింహులు, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకట్రాములు, సంతోష్, కృష్ణ పాల్గొన్నారు.

పచ్చదనంతో పులకించనున్న పల్లెలు



కొండేరు నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలు

- గ్రామాల్లో మొదలైన హరితవనం పనులు
- ముమ్మరంగా సాగుతున్న మొక్కల పెంపకం
- నియోజకవర్గానికి 8 లక్షల మొక్కలు లక్ష్యం

ఆయా మండలాల వారీగా నర్సరీల్లో మొక్కలు పెంపక లక్ష్యం ఇలా..

మండలం	జీపీలు	గ్రామాలు	నర్సరీలు	లక్ష్యం (లక్షల్లో)
ఇటిక్యాల	29	35	29	1.87
మానవపాడు	16	17	16	1.03
అలంపూర్	14	15	14	0.91
రాజోళి	11	13	11	0.71
ఉండవెల్లి	16	16	16	1.03
వడ్డేపల్లి	10	10	10	0.64
అయిజ	28	31	28	1.81

ఎర్రవల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పల్లెను పచ్చదనంతో నింపేందుకు కోట్ల రూపాయలను ఖర్చుచేసి హరితవనం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ఖాళీ స్థలాల్లో, రోడ్లకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనుంది. దీని కోసం వర్షాలు పడిన వెంటనే పల్లెల్లో విరివిగా మొక్కలు నాటేందుకు గాను నర్సరీల్లో అధికారులు మొక్కలు సిద్ధం చేశారు.

నియోజకవర్గంలో ఇలా..

అలంపూర్ నియోజకవర్గంలో 124 గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటడం కోసం ప్రభుత్వం ఒక నర్సరీని ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీలో 6000 మొక్కల చొప్పున నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 8 లక్షల మొక్కలు పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా పెద్ద గ్రామాల్లో 8 వేల నుంచి 9వేలు, చిన్న గ్రామాల్లో 6 వేల నుంచి 7వేల వరకు మొక్కలు పెంచుతున్నారు.

మొక్కలు సిద్ధం..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సరీని ఏర్పాటు చేశాం. నర్సరీలో ప్రస్తుతం దాదాపు 6వేల మొక్కలను పెంచుతున్నాం. ఇప్పటికే పలు రకాల మొక్కలు ఏపుగా పెరిగి నాటేందుకు గాను సిద్ధంగా ఉన్నాయి. హరితవనం కోసం ప్రభుత్వం ఇచ్చిన మొక్కల పెంపక లక్ష్యాన్ని చేరుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

–రాజు, పంచాయతీ కార్యదర్శి, కొండేరు

విరివిగా మొక్కలు పెంచుతున్నాం..



ప్రతి గ్రామంలో హరితవనం కోసం నూతన నర్సరీలు ఏర్పాటు చేశాం. పాత నర్సరీల్లో పెంచిన మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో ప్రస్తుతం మొక్కలు ఎదుగుదల దశలో ఉన్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితవనం కార్యక్రమంలో విరివిగా మొక్కలు నాటి లక్ష్యాన్ని చేరుకునేందుకు సిద్ధం ఉన్నాం.

– శివజ్యోతి, ఏపీఓ, ఇటిక్యాల



కోదండాపురంలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

కేంద్రాల్లో ప్రారంభమైన కొనుగోళ్లు



కొండేరులో ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న హమాలీలు



మిల్లుకు తరలించేందుకు సిద్ధమైన ధాన్యం బస్తాలు

సాక్షి ఎఫెక్ట్..

ఎర్రవల్లి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి సాక్షిలో వెలువడిన ఓ కథనానికి అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. కేంద్రాలు తెరిచారు.. కొనుగోళ్లను మరిచారు అనే కథనం ఈనెల 24న సాక్షిలో ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఐకేపీ సిబ్బంది శుక్రవారం మండలంలోని కొండేరు, జింకలపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. కొండేరులో 1,432, జింకలపల్లి 715 (మొత్తం 2147) బస్తాల ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించారు. పక్షం రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సాక్షి కథనాన్ని ప్రచురించడం తోనే అధికారులు ధాన్యం కొనుగోలును చేపట్టారని ఆయా గ్రామాల రైతులు సాక్షికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీలో పెత్తనం చెలాయించడం తగదు

గద్వాలన్యూటౌన్: కారు గుర్తుతో ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీలో పెత్తనం చెలాయించడం తగదని గద్వాల కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి శెట్టిత్మకూర్ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, ఇందిరమ్మ కమిటీల పేరుతో గ్రామాల్లో వైషమ్యాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ జెండా మోసిన వారికి ప్రభుత్వ పథకాలు దక్కకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఒక వర్గానికి కొమ్ము కాస్తే పేద ప్రజల నుంచి నిరసన తప్పదని అధికారులకు సూచించారు. అర్హత కల్గిన వారినే ఎంపిక చేయాలని అధికారులను కోరారు.



మాట్లాడుతున్న లక్ష్మణ్

కార్యక్రమంలో నాయకులు అల్వాల రాజశేఖర్‌రెడ్డి, డీటీడీసీ నర్సింహులు, ఆనంద్, పటేల్ శ్రీనివాసులు, జగదీష్, రాఘవేంద్ర, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థిని రేణుకను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

అలంపూర్: ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని నివాసంలో ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థిని రేణుకకు అభినందించారు. 993 మార్కులు సాధించినట్లు విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, కృష్ణయ్య, రాముడు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



లావణ్యను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గట్టు: ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాయాపురం లావణ్యను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, సీనియర్ నాయకులు బల్గెర శివారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నల్లారెడ్డి, గట్టు మండల అధ్యక్షుడు నాగప్ప, బీజేవైఎం మండల అధ్యక్షుడు వీరశేఖర్‌గౌడ్, నాయకులు వీరారెడ్డి, బెల్లం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చేపట్టిన మరమ్మతుల కారణంగా శనివారం మండల కేంద్రంతోపాటు, బింగుదొడ్డి, జడ్డొడ్డి, ఎక్లాస్‌పురం, దేవబండ గ్రామాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నీలి గోవిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

యూనిఫాంలు సకాలంలో అందించాలి



ధరూరు: పాఠశాలల ప్రారంభం కంటే ముందే ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం అందించేందుకు స్టిచ్చింగ్ చేసి సిద్ధం చేయాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో యూనిఫాం కటింగ్, స్టిచ్చింగ్‌కు సంబంధించిన విధానాన్ని పరిశీలించారు. కుట్టు నాణ్యతగా ఉండాలని, సకాలంలో దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శోభారాణి, సీఆర్పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు సిమెంట్ లోడ్ వితరణ

అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాలకు అదాని కంపెనీ యాజమాన్యం సిమెంట్ లోడ్ శుక్రవారం వితరణ చేసినట్లు ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. చిత్తాపూర్ ఫ్యాక్టరీ నుంచి మొదటి సిమెంట్ వెహికల్‌ను అలంపూర్ క్షేత్రంలో వెలిసిన జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానానికి సమర్పించాలని సంకల్పించినట్లు తెలిపారు. అందులో భాగంగా 520 సిమెంట్ బస్తాలు దేవస్థానానికి పంపించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు జోనల్ హెడ్ కే.నరేష్, టెక్నికల్ ఇంజినీర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ లోడుతో కంపెనీ ప్రతినిధులు

మల్లాపురంలో తాగునీటి కష్టాలు



కేటీదొడ్డి: మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో గత నాలుగు రోజులుగా తాగునీటి కోసం ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గ్రామస్తులు నీళ్ల కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. అధికారులకు సమస్యను విన్నవించిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. మిషన్ భగీరథ నీళ్లు తక్కువగా వస్తున్నాయని, తద్వారా కొన్ని కాలనీలకు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ప్రత్యామ్నాయంగా బోరు మోటారును బాగు చేయించి సమస్య పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

నల్లాకు మోటార్లు తొలగించాలి

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామంలో శుక్రవారం మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌కు ఏర్పాటు చేసిన మోటార్లు తొలగించినట్లు మిషన్ భగీరథ ఏఈ రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్లో కంట్రోల్ వాల్ పెట్టించుకోవాలని సూచించారు. లేని యెడల రూ.5వేలు జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

శాంతియుత చర్చలు జరపాలి

గద్వాల: చత్తీస్‌గఢ్ అడవుల్లో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దమనకాండను తక్షణమే ఆపి శాంతిచర్చలు జరపాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్‌పాష, కో కన్వీనర్ హనుమంతులు పత్రికా ప్రకటనలో కోరారు. దశాబ్దాలుగా దేశ సంపద బడాబాబుల చేతిలో ఉందన్నారు. అమాయక పౌరులనే బలిచేసే చర్యలు తక్షణమే ఆపి శాంతిచర్చలు జరపాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

మానవపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. పౌష్టికాహారం, చిన్నారుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు శుక్రవారం డాక్టర్ స్వరూపరాణి, జయమ్మ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు మాట్లాడుతూ.. మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటస్వామి, వెంకటనర్సమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

అలంపూర్: మండల పరిధిలోని క్యాతూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన



బి.వీరాపురంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువత



పెంచికలపాడులో నిరసన ర్యాలీ



శాంతినగర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ, పట్టణ ప్రజలు

అయిజ/ఎర్రవల్లి/గట్టు/శాంతినగర్/ఉండవెల్లి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ అయిజ మండల కేంద్రంలో శుక్రవారం అఖిలపక్షం కమిటీ నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దాడి హేయమైన చర్యని, దీనికి వారు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మాదన్న, విజయభాస్కర్ రెడ్డి, వెంకట్రాములు, ఆంజనేయులు, రామచంద్రారెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– పహల్‌గామ్‌లో హిందువులపై టెర్రరిస్టులు జరిపిన మారణకాండను వ్యతిరేకిస్తూ గట్టు మండల కేంద్రం, పెంచికలపాడులో శాంతి ర్యాలీ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు బల్గెర శివారెడ్డి, నల్లారెడ్డి, గూడూరు నాగప్ప, వీరశేఖర్, బెల్లం నర్సింహులు, అంగడి బస్వరాజు, నర్సింహులు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



గట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

« జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడికి నిరసనగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అలంపూర్– రాయచూర్ ప్రధాన రహదారిపై కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు,పట్టణవాసులు అధికసంఖ్యలోపాల్గొన్నారు.

« పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని బి. వీరాపురం గ్రామంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు వివిధ సంఘాల నేతలు, యువకులు కూడలిలో కొవ్వొత్తులతో నివాళులర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అయిజలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

« ఉండవెల్లి మండలంలోని బొంకూరు గ్రామంలో కశ్మీర్ ఉగ్రదాడి ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక నాటకాలంటే ప్రజలకు మక్కువ



కళాకారులతో జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: పౌరాణిక నాటకాలంలే ప్రజలకు ఎంతో ఇష్టమని జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని సోళీపురంలో ఈ నెల 23 నుంచి శుక్రవారం వరకు శ్రీ చింతల మునిరంగస్వామి నాటక ప్రదర్శన నిర్వహించారు. చివరి రోజు రాత్రి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నాటక ప్రదర్శన చేసిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వ కాలంలో గ్రామాల్లో నాటకాలు నిర్వహిస్తున్నారంటే చాలు ఊరు మొత్తం అక్కడికి చేరి ఎంతో శ్రద్ధగా వీక్షించేవారన్నారు. సెల్, కంప్యూటర్, టీవీ లాంటివి వచ్చిన తర్వాత ఈ పౌరాణిక నాటకాలు అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో సోళీపురం గ్రామంలో నాటకాన్ని ప్రదర్శించడం చాలా సంతోషించదగిన సమయమన్నారు. కార్యక్రమంలో గంధం నాగరాజు, బీజేపీ మండల నాయకుడు నవీన్‌రెడ్డి, కొత్తూరు మన్యం, జానయ్య, రాచాల వెంకటయ్య, కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో హద్దుల ఏర్పాటు

మానవపాడు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న స్థలాలకు హద్దులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ ధర్మ, గద్వాల డీఎం సునీత తెలిపారు. 30 షాపులకు సంబంధించి 10/10 హద్దులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.